
మేం వైసీపీ కోసమే..
పనిచేస్తున్నాం
- వలంటీర్ల ఆత్మీయ సమ్మేళనంలో ఓ వలంటీరు
- ప్రతి 50 కుటుంబాలతో ఓట్లు వేయించే బాధ్యత మీదే: రౌతులపూడి జడ్పీటీసీ దివాణం

‘పట్టు’పట్టాల్సిందే

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అంతకంతకూ పెరుగుతున్న ఎన్నికల కాక
- రాజకీయంగా అత్యధిక సీట్లు సాధించడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన పావులు
- సాధ్యమైనంత ఎక్కువగా ఉమ్మడి జిల్లాలో పర్యటనలు ఉండేలా ఇరుపార్టీల ప్లాన్
- రాజకీయంగా కీలక జిల్లా కావడంతో రెండు పార్టీల అధినేతల ప్రత్యేక దృష్టి
- 15న అమలాపురం, 16న కాకినాడ, 17న తూర్పుగోదావరిలో పవన్ పర్యటన
- మూడురోజులపాటు నియోజకవర్గాల ముఖ్య నేతలతో అంతర్గత సమీక్ష
- టీడీపీ, జనసేన పార్టీల మధ్య సమన్వయం పెంచడమే లక్ష్యంగా సమీక్షలు
- ఉమ్మడి జిల్లాలో వైసీపీకి ఒక్క సీటూ రాకుండా చేస్తానంటూ ఇప్పటికే పవన్ శపథం
- వచ్చేనెల రెండో వారం ఉమ్మడి జిల్లాలో లోకేశ్ ఎన్నికల శంఖారావం
- 13 నియోజకవర్గాల్లో మండలస్థాయి కార్యకర్తలతో సమావేశాలు
- రోజుకు మూడు నియోజకవర్గాల్లో రోడ్‌షోలు, సభలు: త్వరలో రూట్‌మ్యాప్

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల కాక అంతకంతకూ పెరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముహూర్తం సమీపిస్తుండడంతో టీడీపీ, జనసేన పార్టీలు కదనరంగంలో కసరత్తును మరింత పెంచుతున్నాయి. అధికార వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేసేలా చకచకా ఎన్నికల వ్యూహాలకు పదును పెంచుతున్నాయి. రాజకీయంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏ పార్టీకైనా అత్యంత కీలకం. ఇక్కడ అత్యధిక సీట్లు నెగ్గిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్న ఆనవాయితీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో అత్యధిక సీట్లు నెగ్గడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఇందులోభాగంగా సాధ్యమైనంత ఎక్కువదృష్టి ఈ జిల్లా పైనే కొనసాగించి ప్రచారాలు, సమీక్షలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఈనెల 15, 16, 17 తేదీల్లో జిల్లాలో మూడు పార్లమెంట్ స్థానాల్లో సమీక్షలు నిర్వహించబోతున్నారు. ఆ తర్వాత మరో దఫా పర్యటనకు మార్చిలో రానున్నారు. అటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మార్చి రెండోవారం నుంచి ఉమ్మడి జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించబోతున్నారు. మొత్తం 13 స్థానాల్లో రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున రోడ్డుషోలు, సమావేశాలు నిర్వహించబోతున్నారు.

దెబ్బకొట్టాల్సిందే..

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ఇంకా కొన్ని వారాలే గడువుంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత ఎక్కువ దృష్టిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాపై టీడీపీ, జనసేన పార్టీలు దృష్టిసారించాయి. ఉమ్మడి తూర్పు అంటే టీడీపీకి కంచుకోట. అటు జనసేన సైతం రాష్ట్రం మొత్తం మీద తమకు బాగా బలమున్న జిల్లాగా తూర్పునే భావిస్తోంది. ఈ నేపథ్యంలో దాదాపు అన్నిస్థానాల్లో ఈ రెండు పార్టీలు కలిసి విజయబావుటా ఎగుర వేయడానికి కొంతకాలంగా వ్యూహాత్మకంగా ప్రణాళికలు సిద్ధం చేశాయి. మరోపక్క వచ్చే ఎన్నికల్లో అధికార వైసీపీకి ఉమ్మడి తూర్పులో ఒక్క సీటు కూడా రాకుండా చేసే బాధ్యత తనది అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఇటీవల ప్రకటించారు. దీనికి అనుగుణంగానే టీడీపీతో కలిసి ఆయన ఎన్నికల వ్యూహాలు జిల్లాలో అమలు చేస్తున్నారు. ఇప్పటికే మొన్న డిసెంబరులో కాకినాడలో మకాంవేసి ఉమ్మడి జిల్లా పార్టీ నేతలతో సమీక్షించారు. టీడీపీ నేతలతోను భేటీ అయ్యారు. ఈ రెండు పార్టీలు నియోజకవర్గాల్లో సమన్వయంగా పని చేయడంపై కూలంకషంగా చర్చించారు. మళ్లీ ఇప్పుడు తిరిగి పవన్ ఈ నెల 15నుంచి మూడురోజులపాటు ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు.

15 నుంచి పవన్ అంతర్గత సమీక్ష

15న అమలాపురం, 16న కాకినాడ, 17న రాజమహేంద్రవరంలో ఆ యా పార్లమెంట్ స్థానాలపై కూలంకష సమీక్ష చేపట్టనున్నారు. వాస్తవానికి బుధవారం భీమవరం కేంద్రంగా పవన్ పర్యటన ఉంది. కానీ హెలీకాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతులు ఇవ్వకపోవడంతో పర్యటన రద్దయింది. కానీ యథావిధిగా ఉమ్మడి జిల్లా పర్యటన కొనసాగనుంది. జిల్లాలో నియోజకవర్గాలవారీగా జనసేన బలాలు, టీడీపీతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లే వ్యూహాలపై ఈనెల 15 నుంచి పవన్ అంతర్గత సమీక్ష చేయనున్నారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో జనసేన పోటీ చేసే స్థానాలు, టీడీపీ బరిలోకి దిగే స్థానాలపై పవన్‌కు ఇప్పటికే స్పష్టత ఉన్న నేపథ్యంలో ఈ రెండు పార్టీలు కలిసి మొత్తం అన్ని సీట్లు క్లీన్ స్వీప్ చేసేలా ఆయన అడుగులు వేస్తున్నారు. ఇందులోభాగంగా రెండు పార్టీల మధ్య ఎక్కడా సమన్వయలోపం అనేది లేకుండా అంతా కలిసి నడిచేలా దిశానిర్దేశం చేయనున్నారు. అటు టీడీపీ పోటీ చేసే స్థానాల్లో ఎక్కడా లోటు లేకుండా జనసేన పార్టీ నుంచి సహకారం పూర్తిస్థాయిలో ఎలా అందించాలనే దానిపై చర్చించనున్నారు. ఇది ముగిసిన తర్వాత మార్చిలో మరో దఫా మూడు జిల్లాల్లోను మరోసారి నియోజకవర్గాలవారీగా సమీక్ష చేపట్టనున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఉమ్మడి తూర్పుగోదావరి కేంద్రంగా పవన్ ఎన్నికలయ్యేవరకు ఇక్కడే దృష్టిసారించబోతున్నారు.

పాదయాత్రతో మురిపించి.. శంఖారావంతో మెరిపించేలా..

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వచ్చేనెల రెండో వారం నుంచి ఉమ్మడి జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. మొత్తం మూడు పార్లమెంట్ స్థానాల పరిధిలో 13 నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. వాస్తవానికి ఈనెల 23 నుంచి యాత్ర చేపట్టాలని భావించారు. కానీ అత్యధిక సీట్లలో టీడీపీ రాయలసీమలో పోటీ చేస్తుండడం, ఇక్కడ అభ్యర్థులపై స్పష్టత వచ్చేయడంతో జోన్-5 పరిధిలోని రాయలసీమలో యాత్ర ఖరారు చేశారు. ఇది ముగిసిన తర్వాత ఉమ్మడి తూ.గో.లో మార్చి రెండోవారం నుంచి శంఖారావం కొనసాగనుంది. మొన్న డిసెంబర్‌లో ఉమ్మడి జిల్లాలో యువగళం పేరుతో లోకేశ్ సుదీర్ఘ పాదయాత్ర చేసి పార్టీలో ఊపు తీసుకువచ్చారు. అధికార వైసీపీ వైఫల్యాలను జనంలోకి వెళ్లేలా చేయడంలో సక్సెస్ అయ్యారు. ఒకరకంగా జిల్లాలో పాదయాత్ర చెరగని ముద్రవేసింది. ఆ తర్వాత ఇటీవల చంద్రబాబు ఉమ్మడి జిల్లాలో తుని, మండపేట, రాజమహేంద్రవరం రూరల్‌లో రా.. కదలి రా సభలతో దుమ్మురేపారు. జనప్రభంజనం సృష్టించి అధికార వైసీపీలో వణుకు పుట్టించారు. నారా భువనేశ్వరి నిజం గెలవాలి యాత్రతో మహిళలకు చేరువయ్యారు. ఇప్పుడు లోకేశ్ మరోసారి ఉమ్మడి జిల్లాలో దాదాపు ఐదురోజులు పర్యటిం చనున్నారు. రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున రోడ్‌షోలు, సభలు నిర్వహిస్తారు. పూర్తిగా మండల, బూత్‌స్థాయి కార్యకర్తలతో మమేకమ య్యేలా ఎన్నికల శంఖారావం కొనసాగనుంది. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ని ధీటుగా ఎదుర్కోవడం, సూపర్ సిక్స్ పథకాలను జనంలోకి విస్తృతంగా తీసుకువెళ్లేలా సభలు, సమావేశాలు నిర్వహిస్తారు. రోడ్‌షోలతో జనంతో మమేకమవుతారు. ఇది ముగిసిన తర్వాత మళ్లీ పవన్‌కళ్యాణ్ ఉమ్మడి జిల్లా పర్యటనకు మరో దఫా రానున్నారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు ఇరుపార్టీల కీలక నేతలు ఉమ్మడి జిల్లా కేంద్రంగా రాజకీయం చేసి దాదాపు అన్ని సీట్లలో వైసీపీని మట్టికరిపించడమే ధ్యేయంగా ఎన్నికల వ్యూహాలు అమలు చేయనున్నారు.

సాధారణ ఎన్నికలకు అధికారులు సన్నద్ధం కావాలి

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా
- జిల్లాలో ఎన్నికల నోడల్ అధికారుల నియామకం



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 13: రాబోయే సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్, కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్వో కృతికాశుక్లా సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికాశుక్లా.. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి ఎన్నికల ఆర్వోలు, ఈఆర్వోలు, నోడల్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకుని అందరూ కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు వివిధ అంశాల్లో సహకరించేందుకు 19మంది సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించామన్నారు. ఏదైనా సందేహాలుంటే కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగంలో సంప్రదించాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడానికి స్వీప్ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. మహిళలు, దివ్యాంగులు, యువ ఓటర్ల కోసం మోడల్ పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలను పంపించాలన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుకోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన సమయంనుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందన్నారు. కాకినాడలోని జేఎన్‌టీయూలో ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అక్కడ ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్‌రూమ్‌లు, ఓట్ల లెక్కింపు హాళ్లను ఆర్వోలు పరిశీలించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు, సీపీవో పి.త్రినాథ్, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, జిల్లా పౌరసంబంధాల అధికారి నాగార్జున పాల్గొన్నారు.

ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం

జిల్లాలో లోక్‌సభ, శాసనసభ-2024 ఎన్నికలు సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు కాకినాడ జిల్లాలో వివిధ శాఖల సీనియర్ అధికారులను ఎన్నికల నోడల్ అధికారులుగా జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కృతికాశుక్లా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ అధికారులంతా కాకినాడ జిల్లాలో 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు సజావుగా పూర్తయ్యేవరకు జిల్లా నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నోడల్ అధికారుల వివరాలు

మ్యాన్ పవర్ నిర్వహణ నోడల్ అధికారులుగా జిల్లా ఎకనామిక్స్ అండ్ స్టాటస్టిక్స్ ఆఫీసర్, డీపీవో ఎస్‌ఐసీ కాకినాడను నియమించారు. ట్రైనింగ్ మేనేజ్మెంట్‌కు నోడల్ అధికారిగా కాకినాడ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిని, మెటీరియల్ నిర్వహణకు నోడల్ అధికారిగా డ్వామా ప్రాజెక్టు అధికారిని, ట్రాన్స్‌పోర్టు నిర్వహణకు నోడల్ అధికారిగా కాకినాడ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌ను, కంప్యూటరైజేషన్, సైబర్ అండ్ ఐటీ సెక్యూరిటీ నిర్వహణ నోడల్ అధికారిగా జిల్లా ఇన్ఫర్మెటిక్ అధికారి, పెద్దాపురం డివిజనల్ డెవలప్మెంట్ అధికారిని, లాఅండ్‌ఆర్డర్, వీఎం అండ్ సెక్యూరిటీ ప్లాన్ నిర్వహణకు నోడల్ అధికారిగా జిల్లా ఎకనామిక్స్ అండ్ స్టాటస్టిక్స్ ఆఫీసర్‌ను నియమించారు. ఈవీఎం మేనేజ్‌మెంట్ నిర్వహణకు నోడల్ అధికారులుగా డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్‌ను, ఎంసీసీ/వెబ్ కాస్టింగ్ నిర్వహణకు నోడల్ అధికారిగా జిల్లా పంచాయతీ అధికారిని, ఎక్స్‌పెండీచర్ మానిటరింగ్ నిర్వహణకు నోడల్ అధికారులుగా జిల్లా ఆడిట్ అధికారి, పేఅండ్ అకౌంట్స్ అధికారులను, బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్ పేపర్ల నిర్వహణ నోడల్ అధికారిగా జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారిని, మీడియా నిర్వహణకు నోడల్ అధికారిగా సమాచార పౌరసంబంధాలశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను, కమ్యూనికేషన్ ప్లాన్ నిర్వహణకు నోడల్ అధికారిగా గృహ నిర్మాణశాఖ పీడీని, ఎలక్టోరల్ నోడల్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారిని నియమించారు. ఫిర్యాదులు, రీడ్రెసల్, ఓటర్ హెల్ప్‌లైన్ నిర్వహణకు నోడల్ అధికారిగా జిల్లా పౌరసరఫరాల అధికారిని, నామినేషన్, రిపోర్ట్స్ నిర్వహణకు నోడల్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారిని, ప్రిపరేషన్ ఆఫ్ స్కెచెస్ నిర్వహణకు నోడల్ అధికారిగా జిల్లా సర్వే, లాండ్ రికార్డ్స్ అధికారిని నోడల్ అధికారిగా నియమించారు.

పట్టుపై ఊజీ ఈగ కలకలం

- ఒక్క ఈగతో 50శాతం పంటకు నష్టం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 13: పట్టు పంటపై ఆశిస్తున్న ఊజీ ఈగ కలకలం సృష్టిస్తోంది. ఒక్క ఊజీ ఈగవల్ల 50శాతానికి పైగా పంటను నష్టపోయే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వాతావరణం అతి శీతలంగా ఉన్న సమయంలో పట్టు పురుగులపై ఆశించే ఊజీ ఈగలతో తీవ్రనష్టం వాటిల్లుతుంది. రైతులు కనీసం పెట్టుబడులు దక్కించుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. గొల్లప్రోలు మండలం చేబ్రోలు తదితర ప్రాంతాల్లోని షెడ్లలో పట్టుపురుగుల పెంపకం జరుగుతోంది. వేయిమందికి పైగా రైతులు పట్టుసాగుపై ఆధారపడి ఉన్నారు. ఒక ఊజీ ఈగ పట్టుపురుగుపై ఆశిస్తూ రోజుకు 3వేల గుడ్లు పెడుతుంది. ఆరులైన్లల్లో ఉండే పట్టుపురుగులపై ఇది ఒక రోజులోనే వ్యాపిస్తుంది. ఇది లార్వా కింద ఉన్న సమయంలోనే పట్టు పురుగు శరీరంలోకి ప్రవేశించి లోపల తయారయ్యే సిల్కును తొలుత తినివేస్తుంది. తదనంతరం పురుగను చంపివేస్తుంది. ఎండ తీవ్రత పెరిగే కొలది పురుగు ఉధృతి తగ్గుతుంది. ఇప్పుడు అతిశీతల గాలుల ప్రభావంతో ఉధృతి అధికమైంది. 2019-21 మధ్యకాలంలో ఊజీ పురుగు తీవ్ర నష్టం కలుగచేయడంతో అప్పట్లో క్రాప్ హాలీడే పాటించడంతోపాటు నియంత్రణకు చర్యలు చేపట్టడంతో నివారించగలిగారు. ఇప్పుడు మళ్లీ ఉధృతి అధికంగా కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే పలుప్రాంతాల్లో రైతులు ఊజీ ఈగవల్ల నష్టపోయారు. ఊజీ ఈగ నియంత్రణకు అవసరమైన పౌచెస్ అందుబాటులో లేకపోవడం, వీటిని మైసూరు, అనంతపురంనుంచి తెప్పించాల్సి రావడంతో నష్టం మరింత అధికంగా ఉంటుందని పట్టు రైతులు కలవరానికి గురవుతున్నారు. పౌచ్ అనేది ఒక రకం ఈగ. దీన్ని ప్రయోగించడం ద్వారా ఊజీ ఈగను నియంత్రించవచ్చునని సెరీకల్చర్ అధికారులు చెబుతున్నారు. ఈ పౌచ్‌లను రైతులే కొనుగోలు చేయాలని పట్టు అధికారులు చెబుతున్నారు. వీటిని ప్రభుత్వం అందించాల్సి ఉండగా రైతులు సొమ్ములు చెల్లిస్తే మైసూరునుంచి తెప్పిస్తామని వారు తెలపడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఊజీ ఈగ నియంత్రణపై పట్టుపరిశ్రమశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి పౌచెస్ తక్షణం అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.



పట్టు పురుగుపై ఆశించిన ఊజీ ఈగ

సొమ్ములు పడేది ఎప్పుడు?

- నెలరోజులు పైబడినా ధాన్యం బిల్లులు అందక రైతుల ఆందోళన
- జిల్లాలో 4500 టన్నుల ధాన్యానికి రూ.10కోట్ల బకాయిలు



కోటనందూరు, ఫిబ్రవరి 13: ఆరుగాలం శ్రమించి పండించినా ధాన్యంతో రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఏటా కష్టాలు పడుతున్నా పాలకలు కనికరించడంలేదు. రెండేళ్లుగా రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు తప్పడం లేదు. తాము పండించే పంటకు తీసుకున్న అప్పులకు వడ్డీలు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఇంతవరకు ఖరీఫ్‌కు సంబంధించి 28వేలమంది రైతులనుంచి 1.50లక్షల మేర టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇంతవరకు రూ.317కోట్ల మేర బిల్లులు చెల్లించారు. అలానే 4500 టన్నులకు సంబంధించి రూ.10కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉంది. ఇవి జనవరినుంచి ఇంతవరకు ఇవ్వలేదు. ధాన్యం బిల్లులకోసం రైతుల ఎదురుచూపులే మిగిలాయి తప్పితే సొమ్ములు పడడం లేదు. ధాన్యం బిల్లులు వస్తే పెట్టిన పెట్టుబడులనైనా తిరిగి వస్తాయని రైతులు ఆశగా చూస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ధాన్యం బిల్లులు త్వరగా అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● త్వరలో బిల్లులు అందిస్తాం

జిల్లాలో రైతులకు పడ్డ బకాయిలను త్వరలో అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే చాలావరకు అందించాం. ఇంకా రూ.10కోట్ల బకాయిలు ఉన్నాయి. ఈ వారంలో బకాయిలు ఇచ్చేస్తాం.

-ఎం.బాల సరస్వతీ, డీఎం, సివిల్‌సప్లైస్, కాకినాడ

జీజీహెచ్‌లో ఘనంగా మదర్స్ మిల్క్‌బ్యాంక్ వార్షికోత్సవం



జీజీహెచ్‌లో బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ లావణ్యకుమారి

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 13: కాకినాడ జీజీహెచ్‌లో చంటి పిల్లలకు ఎంతో సౌలభ్యత చేకూరుస్తున్న ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ మొదటి వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ డి.మాణిక్యాంబ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ జీజీహెచ్‌లో ధాత్రి స్వచ్ఛంద సంస్థ ఈ మదర్ మిల్క్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. డాక్టర్ మాణిక్యాంబ మాట్లాడుతూ తల్లి పాల సమస్యను ప్రతి తల్లి దగ్గరికి వెళ్లి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. గతేడాది కాలంలో 1350మంది తల్లులు జీజీహెచ్‌లో చికిత్స పొందామన్నారు. ఇప్పటివరకు 3, 60, 114 ఎంఎల్ పాలను మదర్స్ మిల్క్ బ్యాంక్ ద్వారా బాలింతలకు అందించామన్నారు. ఆర్ఎంవో డాక్టర్ రాహుల్, డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, డాక్టర్ రాంబాబు, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ సూర్య, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రణాళికాయుతంగా ముందుకు వెళ్లాలి

- జిల్లా పంచాయతీ అధికారిణి భారతి సౌజన్య

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 13: గ్రామ పంచాయతీలు, గ్రామాల్లో వేసవికాలం సమీపిస్తున్న దృష్ట్యా తాగునీటి సరఫరాకు తగిన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పంచాయతీ కార్యదర్శులు, విస్తరణ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులకు జిల్లా పంచాయతీ అధికారిని భారతి సౌజన్య సూచనలు జారీ చేశారు. గ్రామాల్లోని ట్యాంకుల ద్వారా మంచి నీటి సరఫరా, పారిశుధ్యం విషయంలో అన్ని పంచాయతీల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈనెల 13, 14 తేదీల్లో జిల్లాల్లో ఉన్న అన్ని ట్యాంకులను క్లీనింగ్ చేయించాలన్నారు. ప్రతి 15రోజులకొకసారి ట్యాంకు పరిసరాలు శుభ్రపరచాలన్నారు. సరఫరా చేస్తున్న నీరు క్లోరినేట్ చేయాలని, పైప్ లైన్ మొదలు, మధ్య, చివరి స్థాయిలో గల కుళాయిల వద్ద నీటిలో క్లోరిన్ శాతం పరీక్షించాలన్నారు. పైపులైను లీకులు బాగు చేయాలన్నారు. ఏవిధమైన అలసత్వం వహించినా, ప్రజలనుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా కార్యదర్శులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు.



వినాయకునికి సప్త నదీ జలాలతో అభిషేకిస్తున్న అర్చకులు

వైభవంగా సప్త నదీ జలాభిషేకం

అయినవిల్లి, ఫిబ్రవరి13: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక ఆలయంలో మంగళవారం సప్త నదీ జలాభిషేకం వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, దీక్షా ప్రారంభం, పుణ్యాహవచనం, పంచగవ్యం, గణపతికల్పం, సప్తనదీ జల మండపారాధన, మహన్యాసం, సప్తనదీ జలాలతో స్వామివారికి అభిషేకం, లక్ష దూర్వార్చన, లక్ష్మీగణపతి అష్టద్రవ్య హోమం, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైనుకు రూ.50 కోట్లు నిధులు: ఎంపీ అనురాధ


అల్లవరం, ఫిబ్రవరి13: కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణంలో భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.50 కోట్లు నిధులు మంజూరు చేసిందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ తెలిపారు. ఎటువంటి అపోహలు వద్దని, రైల్వేలైను నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ రైల్వేలైన్‌కు ఇప్పటివరకు రూ.1,409 కోట్లు సాధించామన్నారు. ఈ ఏడు కేంద్ర బడ్జెట్‌లో రూ.300 కోట్లు, రైల్వే ట్రాకుల మరమ్మతులకు రూ.10 కోట్లు, భూసేకరణకు రూ.50 కోట్లు కేటాయించినట్లు ఎంపీ కార్యాలయం తెలిపింది.

నేడు కాంగ్రెస్ ఉభయగోదావరి జిల్లాల సమీక్ష

పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి



పెరవలి, ఫిబ్రవరి13: ఉభయగోదావరి జిల్లాల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమీక్షా సమావేశం ఈనెల 14న ఉదయం రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్టు పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తెలిపారు. రాజమహేంద్రవరం పేపర్‌మిల్లు గేటు వద్ద ఉన్న సాయి కల్యాణ మండపంలోని జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, కొప్పుల రాజు, ఏఐసీసీ సెక్రటరీ మయ్యప్పన్, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఉభయగోదావరి జిల్లాల పార్టీ పర్యవేక్షకురాలు సుంకర పద్మశ్రీ హాజరవుతారన్నారు. జిల్లాలోని నగర, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యూత్ కాంగ్రెస్ మహిళా విభాగం, అనుబంధ సంస్థల అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు హాజరవ్వాలని కోరారు.



విద్యుదుత్పత్తి నిలిపివేత

మోతుగూడెం, ఫిబ్రవరి13: సీలేరు కాంప్లెక్స్‌లో మూడు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు నీరు విడుదల చేస్తుండడంతో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. బలిమెల, జోలాపుట్టు జలాశయాల్లో ఏపీ వాటాగా 19.92 టీఎంసీలు, గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో 12.81 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గోదా వరి డెల్టాకు డొంకరాయి నుంచి 4వేల క్యూసెక్కుల నీటి నిల్వలు వెళ్తున్నాయి. ప్రస్తుతం గోదావరి డెల్టాకు నీటి అవసరం లేదని జలవనరుల శాఖ అధికారులు చెప్పారు. దీనితో జెన్‌కో అధికారులు నీటిని పొదుపుగా ఉపయోగిస్తున్నారు. రాబోయే వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను అధిగమించడానికి సీలేరు కాంప్లెక్స్‌లో ఉత్పత్తిని నిలుపుదల చేసి, జలాశయాల్లో నీటిని పొదుపు చేస్తున్నారు.

ఒకే ప్రశ్నపత్రం.. ఒకేరోజు డీఎస్సీ నిర్వహించాలి

- ఆన్‌లైన్ పరీక్షా విధానంతో అభ్యర్థులకు తీవ్ర నష్టం
- ఉపాధ్యాయ చరిత్రలో మినీ డీఎస్సీ ఇదే : ఎమ్మెల్సీ ఐవీ



అమలాపురం రూరల్, ఫిబ్రవరి 13: ఆన్‌లైన్ పరీక్షా విధానం డీఎస్సీ ఉద్యోగార్థులకు తీవ్ర నష్టదాయకమని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించిందని, ఒక్కోరోజు ఒక్కో అభ్యర్థికి ఒక్కో ప్రశ్నపత్రంతో పరీక్షలు నిర్వహిస్తే కామన్ మెరిట్ ఎలా తీస్తారని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. డీఎస్సీ అభ్యర్థులందరికీ ఒకే ప్రశ్నపత్రంతో ఒకేరోజు పరీక్ష నిర్వహించాలని డిమాండు చేశారు. అమలాపురం ఎంప్లాయిస్ హోంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన జగన్ ప్రభుత్వ తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. పాదయాత్రలో భాగంగా అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ వేస్తామని నమ్మించి జగన్ ఓట్లు వేయించుకుని ఐదేళ్ల తరువాత మళ్లీ ఎన్నికల వేళ 6100 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఉపాధ్యాయ చరిత్రలో అతి తక్కువ సంఖ్యతో మినీ డీఎస్సీ ప్రకటించడం జగన్ మోసపూరిత చర్యగా అభివర్ణించారు. జగన్ పాలనలో 6,100 పోస్టులు అంటే మిగిలిన ఉపాధ్యాయ పోస్టులు రద్దు చేసినట్లా లేక ఉపాధ్యాయ పోస్టులు అవసరం లేదా అని ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండు చేశారు.

అప్రెంటీస్ దుర్మార్గపుచర్య

1994లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఉపాధ్యాయులు, పీడీఎఫ్ ఎమ్మెల్సీల 16 ఏళ్ల పోరాటాల ఫలితంగా 2010లో అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేశారని ఐవీ చెప్పారు. 2012 నుంచి రెగ్యులర్ నియామకాలు జరిగాయన్నారు. మళ్లీ ఆ విధానాన్ని జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. నిబద్ధతతో కూడిన శిక్షణకోసం అప్రెంటీస్ విధానం ప్రవేశపెట్టామని మంత్రి బొత్స చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.21,585 కోట్ల బకాయిల్లో రూ.5,500 కోట్లు మార్చి నెలాఖరుకు చెల్లిస్తామంటున్న ప్రభుత్వం మిగిలిన బకాయిలను వచ్చే ప్రభుత్వంపైకి గెంటేస్తోందన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించని జగన్ ప్రభుత్వం 12వ పీఆర్సీ ఎప్పుడు అమలుచేస్తుందని, దీనిపై ఉద్యోగులంతా ఆందోళన చెందుతున్నారని ఐవీ అన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో తిరుమల జయకేతనం



అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులతో చైర్మన్ నున్న

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో రాజమహేంద్రవరంలోని కాతేరు తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. సోమవారం సాయంత్రం విడుదలైన జేఈఈ మెయిన్-2024 ఫలితాల్లో తమ విద్యార్థులు యు.సుధీర్, ఎన్.యశ్వంత్, ఎంజీవీ మహేష్ 99.99 పర్సంటైల్ సాధించారని తెలిపారు. అలాగే 14 మంది 99.90 పర్సంటైల్, 158 మంది 99.0 పర్సంటైల్, 282 మంది 98 పర్సంటైల్, 606 మందికి 95 పర్సంటైల్, 1022 మందికి 90 పర్సంటైల్ సాధించారని తెలిపారు. సుమారు 950 మంది పైనే విద్యార్థులు తమ పర్సంటైల్ స్కోర్‌తో ఎన్ఐటీ లేదా ఐఐటీలో సీట్లు సాధిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్-2024 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు అఖిలభారత స్థాయిలో ఉత్తమ పర్సంటైల్ సాధించినట్టు ఆదిత్య కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు బి.రఘురామసహన్ 99.95, జి.జగదీష్‌వెంకటసీతారామ్ 99.95, ఏహెచ్ సత్యనిహంత్ 99.94, ఏ.చరణ్‌ఉమేష్ 99.94 పర్సంటైల్‌ను సాధించారన్నారు. అంతేకాకుండా 62 మంది విద్యార్థులు 99.00 పర్సంటైల్‌పైన సాధించి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ తదితరులు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో షిర్డిసాయి హవా



విద్యార్థులను అభినందిస్తున్న షిర్డిసాయి విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి13: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాజమహేంద్రవరం షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారు. ఈ వివరాలను షిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య వెల్లడించారు. తమ కళాశాల లక్ష్యా అకాడమీలో శిక్షణ పొందుతున్న బి.తనుశ్రీ 99.9 పర్సంటైల్, జె.శ్రీకర్ 99.8, సీహెచ్ బానువెంకటదీపక్ 99.6, ఎం.తాత్వికసాయి 99.4, కె.ప్రదీప్‌శ్రీసత్య 99.4, బి.లక్ష్మణనాయుడు 99.3 పర్సంటైల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. ఆరుగురు విద్యార్థులు 99శాతంపైగా పర్సంటైల్, 15 మంది 98 పైగా, 28 మంది 97పైగా, 53 మంది 95పైగా పర్సంటైల్ సాధించినట్లు శ్రీవిద్య తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ టి.శ్రీధర్ మాట్లాడుతూ తమ విద్యార్థుల్లో 163 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. విజేతలైన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ టి.శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యాడీన్ చంద్రశేఖర్‌లు అభినందించారు.

'మేము వైసీపీ కోసమే పనిచేస్తున్నాం'

ఆత్మీయ సమ్మేళనంలో ఓ మహిళా వలంటీర్ వ్యాఖ్య



రౌతులపూడిలో మాట్లాడుతున్న మహిళా వలంటీర్

రౌతులపూడి, ఫిబ్రవరి 13: వలంటీర్లంతా కేవలం రూ.5 వేల కోసం పనిచేయడం లేదని, వైసీపీ కోసం పనిచేస్తున్నామని రౌతులపూడికి చెందిన సచివాలయం-1 వలంటీర్ అనడం చర్చనీయాంశంగా మారింది. కాకినాడ జిల్లా రౌతులపూడికి మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మండల వలంటీర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు వైసీపీ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు హాజరయ్యారు. రౌతులపూడి సచివాలయం-1 వలంటీర్ మాట్లాడుతూ వలంటీర్‌గా పీజీలు, డిగ్రీలు చేసిన వారు కేవలం రూ.5 వేల జీతం కోసం కాదని, జగన్ అంటే ఎవరో మాకు తెలియదని, జగన్‌ను తామె చూడలేదని.. అయినా తామంతా కేవలం వైసీపీ కోసం పనిచేస్తున్నామని, మళ్లీ ప్రభుత్వం వస్తే తమను గుర్తించి ఉన్నతస్థాయిలో నిలబడతారని అని పేర్కొంది. మిగిలిన వలంటీర్లు కూడా మాట్లాడుతూ వైసీపీకే పనిచేస్తామని తెలిపారు. అలాగే జడ్పీటీసీ గొల్లు దివాణం వలంటీర్లనుద్దేశించి మాట్లాడుతూ మీ పరిధిలోని ప్రతి 50 కుటుంబాలు వైసీపీకి ఓటు వేయించే బాధ్యత మీదేనన్నారు. వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ నెగ్గేలా చూడాలని వలంటీర్లను కోరారు.



హత్యకు గురైన దుర్గ.. (పక్కన) ఫైల్‌ఫొటో

భర్త చేతిలో.. భార్య హత్య

- కుండలేశ్వరంలో ఘటన
- ప్రేమించి పెళ్లి చేసుకున్న జంట

కాట్రేనికోన, ఫిబ్రవరి 13: ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్న భర్త చేతిలో భార్య హత్యకు గురైంది. కుండలేశ్వరం పంచాయతీ టన్నెల్‌పేట గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ముమ్మిడివరం మండలం సోముదేవరపాలేనికి చెందిన పెయ్యాల ఈశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె దుర్గను కాట్రేనికోన మండలం కుండేశ్వరం పంచాయతీ టన్నెలుపేటకు చెందిన జొన్నాడ దుర్గాప్రసాద్ ప్రేమించుకుని పెద్దల సమక్షంలో 2022 డిసెంబరు 10నలో వివాహం చేసుకున్నాడు. ఏవిధమైన కట్న కానుకలు ఇవ్వలేదు. పెళ్లయిన తర్వాత నుంచి కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. దీనిలో భాగంగా సోమవారం సాయంత్రం భార్యభర్తలు గొడవపడ్డారు. ఈ ఘటనలో దుర్గ మృతి చెందింది. భార్య దుర్గను భర్త దుర్గాప్రసాద్ కొట్టడంతో చనిపోయిందని బాధితురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. దుర్గ సోదరుడు పెయ్యల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రెయిలింగ్‌ను ఢీకొన్న బైక్.. సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 13: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన జలాది శిరీష్‌కుమార్ (35) సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్. మూడు రోజుల కిందట బంధువులను పరామర్శించడానికి ఇంటికి వచ్చాడు. ఈనెల 12న ధవళేశ్వరం బంధువుల ఇంటికి వెళ్లి పని ముగించుకుని తిరిగి పల్సర్ బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మార్గమధ్యంలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు వైపు బైక్ అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి కింద పడిపోయిన శిరీష్‌కుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శిరీష్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఆమె ప్రస్తుతం మూడు నెలల గర్భిణి. ఈ ప్రమాదంతో మల్లవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.



విద్యార్థులు, అధికారితో మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

గురుకుల పాఠశాల స్థితిగతులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

రెడ్డి సుబ్రహ్మణ్యం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 13: రామచంద్రపురం మండలం ఆదివారపుపేట బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, పాఠశాలలో స్థితిగతులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం కోరారు. మంగళవారం ఆదివారపుపేటలో గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాలు, తాగునీరు, పరిసరాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో తనిఖీలకు వచ్చిన ఫుడ్‌సేఫ్టీ అధికారితో ఆయన మాట్లాడారు. తాను తనిఖీలకు వచ్చి రెండేళ్లు అయిందని చెప్పగా ఆయనపై రెడ్డి సుబ్రహ్మణ్యం అసహనం వ్యక్తంచేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందితో పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్ జరిగితే తల్లిదండ్రులపై నెపం వేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో రక్షితమంచినీరు లేకపోవడంతో బోరు నీరు తాగడంతో విద్యార్థులు అస్వస్థతకు కారణమని ఆరోపించారు. 500 మంది పేద పిల్లలు చదువుకునే గురుకుల పాఠశాలకు రక్షిత మంచినీరు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. పిల్లలకు రక్షిత మంచినీరు ఇవ్వాలని, మెను ప్రకారం భోజనాలు పెట్టాలని లేనిపక్షంలో టీడీపీ తరఫున ఉద్యమం చేస్తామన్నారు. జిల్లా కలెక్టరు సంఘటనపై స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్కల రిష్యంత్‌రాయ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్, క్లస్టర్ ఇన్‌చార్జి పెంకె సాంబశివరావు, టీడీపీ నాయకుల సలాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి : పీడీఎస్‌యూ

పాఠశాలను సందర్శించిన పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్దూ, స్టూడెంట్స్ జేఏసీ నాయకుడు ప్రత్తిపాటి బులిరాజు తదితరులు మాట్లాడుతూ నాణ్యతలేని చికెన్, గుడ్డు వల్ల ఫుడ్‌పాయిజన్ జరిగిందన్నారు. నాడు-నేడులో రూ.50 లక్షలు రక్షిత మంచినీటికి కేటాయించినా రక్షిత మంచినీరు అందడం లేదన్నారు. ఆహార పదార్థాలు సరఫరా చేసే కాంట్రాక్టు రద్దు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావును సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు.

ఆసుపత్రి నుంచి విద్యార్థుల డిశ్చార్జి

కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురై రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందిన 8 మంది విద్యార్థులను మంగళవారం మధ్యాహ్నం డిశ్చార్జి చేశారు. వారి ఆరోగ్యం కుదుట పడటంతో విద్యార్థులను పంపివేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడు తెలిపారు. కాగా మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలతో విద్యార్థులకు మలం పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించారు.



గంజాయితోపాటు వాహనాలు, నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

22 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, ఫిబ్రవరి 13: రెండు వేర్వేరు కేసుల్లో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపారు. గంజాయి విలువ రూ.1.10 లక్షలు ఉంటుందన్నారు. నెల్లూరుకు చెందిన షేక్ వరీజ్, షేక్ సుభాని, సూరిపోగు లక్ష్మీసాయి వెంకట్ రెండు వాహనాల్లో 20 కిలోల గంజాయిని ఒడిసా నుంచి తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే గుంటూరుకు చెందిన జిన్నాబత్తిన భరత్, సింగపల్లి చరణ్, మేడికొండూరు విశాల్‌కుమార్, షేక్ మస్తాన్ కలిసి ఒడిసా నుంచి కారులో రెండు కిలోల గంజాయిని తీసుకు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మొత్తం ఏడుగురు నిందితులను అరెస్టుచేసి, 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అదృశ్యమైన గురుకుల విద్యార్థులు కాకినాడలో లభ్యం



పోలీస్‌స్టేషన్ వద్ద అదృశ్యమైన విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అల్లవరం, ఫిబ్రవరి 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి సోమవారం అదృశ్యమైన ఇద్దరు విద్యార్థులను కాకినాడ బస్టాండు వద్ద రూరల్ సీఐ పి.వీరబాబు నేతృత్వంలో అల్లవరం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన మెల్లం నాగేంద్రబాబు, కాట్రేనికోన మండలం బట్టుచెరువుకు చెందిన గుర్రాల టోనీబాబు గోడి గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. సోమవారం వారిద్దరూ కనిపించకుండా వెళ్లిపోయారని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ అల్లవరం పోలీసులకు ఫిర్యాదుచేశారు. డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసుల బృందం గాలింపు చర్యలు చేపట్టింది. కాకినాడ బస్టాండులో వారిని గుర్తించి అల్లవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ప్రిన్సిపాల్ సమక్షంలో తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. కేసును ఛేదించిన సీఐ వీరబాబును, అల్లవరం పోలీసులను ఎస్పీ శ్రీధర్ అభినందించారు.



నాపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం

తూర్పు ఎస్పీకి ఏపీ బీజేపీ ఉపాధ్యక్షురాలు గీత ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా తనపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారంతో పరువుకు నష్టం కలిగించేవిధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని.. మానసికంగా వేధిస్తున్నారని మాజీ ఎంపీ, ఏపీ బీజేపీ ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి గీత మంగళవారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ జగదీశ్‌కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ.. "నాకు 53 ఏళ్లు. డిప్యూటీ కలెక్టర్‌గా కూడా పని చేశాను. నా తండ్రి వాల్మీకి కులానికి చెందినవారు. ఆయన కూతురుగా నేను కూడా అదే కులానికి చెందుతానని 2017లో డీఎల్ఎస్‌సీలో కలెక్టర్ ఆదేశాలిచ్చారు. గెజిట్ నోటిఫికేషన్ కూడా వచ్చింది. చట్ట ప్రకారం గెజిట్‌ని చాలెంజ్ చేసే ప్రొవిజన్స్ లేవు. కానీ కొందరు పలుకుబడి ఉపయోగించి కేవలం స్వలాభం కోసం నా కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌పై ఒక ఆర్డర్ తీసుకొచ్చారు. దానిపై కోర్టును ఆశ్రయించాం. కోర్టు ఆ ఆదేశాలను సస్పెండ్ చేసింది. అందువల్ల గెజిట్ ప్రకారం నేను వాల్మీకి అన్నదే నిలుస్తుంది. ఎవరూ కూడా దానిని చాలెంజ్ చేయలేరు. గెజిట్ ఒకసారి విడుదలైన తర్వాత దానిపై ఎలాంటి చర్యలూ చేపట్టే అధికారం ప్రభుత్వానికి లేదు. ఎందుకంటే డిస్ట్రిక్ట్ లెవెల్ సెలక్షన్ కమిటీ(డీఎల్ఎస్‌సీ) ఉత్తర్వులే ఫైనల్. ఈ పరిస్థితుల్లో పని కట్టుకుని గతంలో బీజేపీ ఎంపీగా పోటీ చేసిన కాశీ విశ్వనాథ్ సత్యనారాయణరెడ్డి కేవలం స్వలబ్ధితో అసహ్యకరమైన కామెంట్స్ చేయడంతోపాటు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. మానసిక వేదనకు గురిచేస్తున్న నిమ్మక జయరాజు గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆదివాసీ అసోసియేషన్‌ని జయరాజు పెట్టారు. దానిని రేగు మహేశ్వరరావు, ఈతి ఆంజనేయులు అనే గిరిజనేతరులు నిర్వహిస్తున్నారు. ఆ సోసియేషన్ ఆదివాసీల మేలు కోసం చేసిన పనులేమీ లేవు. అన్నీ బ్లాక్ మెయిలింగ్ పనులే చేస్తోంది. ఆ అసోసియేషన్‌పై జ్యుడీషియల్ విచారణకు హైకోర్టును ఆశ్రయిస్తున్నాను. పరువు నష్టం దావా వేస్తాను. అరకులో బ్యాంక్ లోన్ తీసుకొని ఎగ్గొట్టేశామని దుష్ప్రచారం చేస్తున్నారు. వ్యాపారంలో లోన్లు తీసుకోవడం సర్వసాధారణం. తర్వాత కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. రూ.25 కోట్లు అప్పు తీసుకుంటే వడ్డీతోసహా రూ.65 కోట్లు పూర్తిగా చెల్లించాం. లోన్ తీరినట్టు బ్యాంక్ క్లియరెన్స్ లెటర్ కూడా ఇచ్చింది. అవన్నీ కోర్టులో ఫైల్ చేశాం. మేము బ్యాంకును మోసం చేశామని ప్రచారం చేస్తున్నారు" అని ఆమె వివరించారు. వీటన్నిటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీకి ఫిర్యాదు చేశానని, కోర్టును కూడా ఆశ్రయిస్తానని తెలిపారు.

ఆటో చోరీ కేసులో నిందితులకు 6 నెలల జైలు

ధవళేశ్వరం, ఫిబ్రవరి13: ఇంటి ముందు పార్కుచేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్టు పి.రమణ ఫిర్యాదుమేరకు గత సంవత్సరం జూన్‌లో అప్పటి సీఐ కె.మంగాదేవి కేసు నమోదు చేశారు. సౌత్ జోన్ డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు చేసి పి.రవివర్మ, పి.దుర్గాప్రసాద్, పి.స్వాతిలను అరెస్ట్ చేసి, దొంగిలించిన ఆటోను స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. ఈ కేసును త్వరితగతిన విచారణ జరిపి నిందితులను 3వ అదనపు జ్యూడీషియల్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి సి.రమ్య ముగ్గురు ముద్దాయిలకు ఆరు నెలలు జైలుశిక్ష విధించినట్టు ప్రస్తుత సీఐ జీవీ వినయ్‌మోహన్ తెలిపా రు. ఈ కేసులో ముద్దాయిలకు శిక్ష పడేలా కృషిచేసిన ఏపీపీ కేఎస్ఎస్ లక్ష్మిదేవి, కోర్టు కానిస్టేబుల్ రమేష్‌లను డీఎస్పీ అంబికా ప్రసాద్, సీఐ వినయ్‌మోహన్‌లు అభినందించారు.



సమావేశమైన డీఎంఆర్ శేఖర్, జనసేన నేతలు

రేపు అమలాపురంలో పవన్ పర్యటన?

నాలుగు నియోజకవర్గాల నేతలతో సమావేశాలు

అమలాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 15న కోనసీమ కేంద్రమైన అమలాపురంలో పర్యటించనున్నారు. ప్రస్తుతం ఆయన టూరుకు సంబంధించి ప్రాథమిక షెడ్యూల్ విడుదలైంది. తొలుత భీమవరంలో పర్యటన ముగించుకుని బుధవారం రాత్రికి అమలాపురం చేరుకుంటారని సమాచారం ఉండగా, అనుమతులు రాకపోవడంతో అక్కడ రద్దయింది. అయితే 15వ తేదీ ఉదయం పవన్ ఇక్కడకు చేరుకుంటారని సమాచారం. షెడ్యూల్ ప్రకారం నాలుగు నియోజకవర్గాల నాయకులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహిస్తారు. అమలాపురం నియోజకవర్గంలోని క్రైస్తవులతో 9.30 గంటల నుంచి గంటసేపు సమావేశమవుతారు. ఆ తర్వాత జనసేన ముఖ్య నేతలతో 10.30 నుంచి 11.30 గంటల వరకు భేటీ అవుతారు. 11.30 నుంచి 12.30 గంటల వరకు అమలాపురం, రాజోలు నియోజకవర్గాల టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు రాజోలు నియోజకవర్గ ముఖ్య నాయకులు 40 మందితో, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నారు. అయితే ఈ పర్యటనను బుధవారం మరోసారి ధ్రువీకరిస్తారు. కాగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటనకు అడ్డంకులు కల్పించడాన్ని ఆ పార్టీ కేడర్ తీవ్రంగా పరిగణిస్తోంది. హెలికాప్టర్ దిగేందుకు ఆర్అండ్‌బీ అధికారులు అభ్యంతరం చెప్పడం వెనుక ప్రభుత్వం కుట్ర ఉందనే ఆగ్రహంతో కొందరు యువకులు మంగళవారం రాత్రి అమలాపురంలో కలెక్టరేట్ వద్ద భారీగా గుమిగుడారు. అధికారులెవ్వరూ లేకపోవడంతో వెనుతిరిగారు. మరోవైపు జనసేన పార్లమెంటరీ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ ఆధ్వర్యంలో స్థానికంగా ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. మరోవైపు జనసేన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో ఆయన వర్గీయులు హైస్కూలు సెంటర్‌లోని కన్వెన్షన్ హాలులో మీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.

కాకినాడ

'నేడు అధిక జన మహాసంకల్ప సభ'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 13: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ ప్రాంగణంలో పూర్వ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ నేతృత్వంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు జరిగే అధిక జన మహాసంకల్పసభను విజయవంతం చేయాలని నవ భారత నిర్మాణ సమితి అధ్యక్షుడు నూతలపాటి క్రిష్టాఫర్ కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సభకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అధికంగా తరలి వెళ్లాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 13: కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో ఎ.జ్యోతి తెలిపారు. 50వ వార్డు గైగోలుపాడు-1 కోడ్(0403090) కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్(ఓసీ ఓహ కేటగిరీ), 1వ వార్డు రమణయ్యపేట-1 (0403096) అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్సీ కేటగిరీ), 11వ వార్డు రాజీవ్ గృహకల్ప-2కోడ్ (0403139) అంగన్‌వాడీ సహాయకురాలు(బీసీ-ఏ కేటగిరీ), 2వవార్డు బొందగుంట కోడ్(0403152) అంగన్‌వాడీ సహాయకురాలు(బీసీ-బీ కేటగిరీ), 9వ వార్డు వెంకట్‌నగర్ కోడ్(0403080) అంగన్‌వాడీ సహాయకురాలు(ఓసీ కేటగిరీ), పెదపూడి చాకలిపేట(0420099) సహాయకురాలు అంగన్‌వాడీ వర్కర్(ఎస్టీ కేటగిరీ) పోస్టుల భర్తీ కోసం స్త్రీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను డైరీఫారం సెంటర్ సమీపంలోని సీడీపీవో కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల పలు అంగన్‌వాడీ సెంటర్లలో సహాయకుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో వై.లక్ష్మి ఓ ప్రకటనలో తెలిపాపరు. అంగన్‌వాడీ సెంటర్లలలో సహాయకుల పోస్టులు ఈ విధంగా ఉన్నాయన్నారు. తూరంగి-3 (0420230),ఎస్సీ రిజర్వేషన్‌లో సహాయకురాలు, రమణయ్యపేట-2 (0420163) ఓసీ జనరల్, పెద కొత్తూరు (0422176)బీసీ-బీ సహాయకురాలు పోస్టుల భర్తీ కోసం అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈనెల 22 సాయంత్రం 5 గంటల్లోపు ఐసీడీఎస్ కాకినాడ రూరల్ కార్యాలయం, సర్పవరంలో అందజేయాలని కోరారు. అభ్యర్థుల అర్హతలు రిజర్వేషన్ కేటగిరీ, ప్రాధాన్యతలకు చెందిన ధృవీకరణ పత్రాలు జత చేయాలని, అలా చేయని దరఖాస్తులు తిరస్కరిస్తామన్నారు.

'మాతాశిశు సంరక్షణకు చర్యలు'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జె.నరసింహ నాయక్ అన్నారు. గాడిమొగ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ సామాజిక సేవలో భాగంగా మంగళవారం కాకినాడలో గాంధీభవన్‌లో మాతా శిశు సంక్షేమ సంరక్షకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ చేపట్టిన కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. రిలయన్స్ సీఎస్‌ఆర్ ప్రతినిధి పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతిఏటా రిలయన్స్ సంస్థ మాతా, శిశు సంక్షేమంపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం వందమంది బాలింతలకు 'రిలయన్స్' పౌష్టికాహార కిట్లు అందించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన మహిళలు, బాలింతలకు భోజన ఏర్పాట్లు చేశారు. సీఎస్ ఆర్ఎంవో అనిత, సీటీఎస్ హెచ్‌వోడీ కె.స్వాతిదేవి, సీడీపీవో వి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలి'

తుని రూరల్, ఫిబ్రవరి 13: తెలుగుదేశం, జనసేన ఉమ్మడి కూటమిని గెలిపించాలని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య కోరారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి ఎస్.అన్నవరం, చేపూరి గ్రామాల్లో ఆమె మంగళవారం పర్యటించారు. ప్రజలకు పార్టీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తూ టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి తీసుకొస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చోడిశెట్టి గణేష్, అప్పన రమేష్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, చేపూరి సర్పంచ్ కొండ్రపు నాగేశ్వరరావు, ఎస్.సూరవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి) తదితరులు పాల్గొన్నారు.

'పరిశ్రమలు రాకపోవడం పాలకుల నిర్లక్ష్యమే'

పిఠాపురం, ఫిబ్రవరి 13: కాకినాడ సెజ్ ప్రాంతంలో తొమ్మిదివేల ఎకరాలకుపైగా భూమిని సేకరించి 18 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకూ అక్కడ పరిశ్రమలు రాకపోవడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలోనే ఈ ప్రత్యేక ఆర్థికమండలి ఉన్నా ఇక్కడ పరిశ్రమలు లేకపోవడంతో యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవలసిన పరిస్థితి ఉందన్నారు. జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన యువతీ యువకులకు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన నియమాక ఉత్తర్వులు అందజేశారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహిస్తామని, యువతకు అండగా ఉంటామని తెలిపారు.

'స్థలాలు చూపించి రిజిస్ట్రేషన్ చేయాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 13: జగనన్న నివేశన స్థలాలు నిరుపేద లబ్ధిదారులకు ఎక్కడ కేటాయించారో చూపించి రిజిస్ట్రేషన్‌లు చేయాలని పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీను రెవెన్యూ అధికారులను కోరారు. మంగళవారం డిప్యూటీ తహశీల్దార్ కె.పుణ్యవతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రత్తిపాడులో అనేక మంది నిరుపేద లబ్ధిదారులకు ఉండగా వారికి కేటాయించిన స్థలాలు అప్పగించలేదన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే నివేశన స్థలాలు అప్పగించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని దర్నాల కోట శ్రీను, కొప్పన కోటేశ్వరరావు, దాసరి సత్తిబాబు కోరారు.

'నిరసనకు అనుమతి ఇవ్వండి'

తొండంగి, ఫిబ్రవరి 13: మండలంలో ఏర్పాటైన కాలుష్యకారక డ్రగ్ పరిశ్రమల వల్ల తమ ఉపాధికి భంగం వాటిల్లుతోందని, తమ ఆవేదనలను తెలిపేందుకు జరిపే నిరసనకు అనుమతివ్వాలని మత్స్యకార నేతలు పోలీసులకు మంగళవారం వినతి అందించి గురువారం తాము జరిపే కార్యక్రమానికి సహకరించాలని కోరారు. టీడీపీ జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోడ వెంకటరమణ, మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, మాజీ జడ్పీటీసీ చొక్కా కాశీశ్వరరావు, నూరాడ రాంబాబు, బుల్లబ్బాయి పాల్గొన్నారు.

బీజేపీ నాయకులను అడ్డుకున్న పోలీసులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 13: విజయవాడలో మంగళవారం నిర్వహించిన రైతు గర్జన సభకు ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల నుంచి బీజేపీ నాయకులను పోలీసులు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ప్రత్తిపాడులో జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఏలేశ్వరంలో బీజేపీ నాయకులు హౌస్ అరెస్టుకు నిరసనగా తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బీజేపీ నాయకులు కొల్లా శ్రీనివాస్, కర్రి ధర్మరాజు, కందా వీరాస్వామి, కూరాకుల రాజా, రెడ్డి లోవరాజు, గడ్డం వెంకటరమణ, ఏనుగు ధర్మరాజు, ద్రాక్షారపు పోసిరావు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

తొండంగి, ఫిబ్రవరి 13: గోపాలపట్నంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి దాడిశెట్టి రాజా మంగళవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళీ, జడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైసీపీ నేతలు గాబురాజు, ఆరుమిల్లి ఏసుబాబు, వైగిరి, సర్పంచ్ కటకం శివ, బెక్కం చంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13: పండూరు-1 (అర్బన్)లో రూ. 2.42 కోట్ల జలజీవన్‌మిషన్ నిధులతో జగనన్న లేఅవుట్‌లో ఇంటింటా కుళాయి, రూ.9.30 కోట్ల నిధులతో పండూరు తాగునీటి పథకం అభివద్ధి పనుల కోసం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శంకుస్థాపన చేశారు. సూర్యారావుపేటలో జగనన్న కాలనీ లే అవుట్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకు, ఇంటింటా కుళాయి కనెక్షన్ల పనులకు శంకుస్థాపన నిర్వహించారు. షైనర్‌పేటలో నిర్మించిన పైపులైన్, ఓవర్ హెడ్ ట్యాంకు పనులను ప్రారంభోత్సవం చేశారు.

సారా కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 13: నాటుసారా తయారీ, విక్రయాలు సాగిస్తూ పట్టుబడ్డ ఇద్దరు నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో కాకినాడ స్పెషల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) కోర్టు న్యాయమూర్తి ఎ.నాగమల్లేశ్వరి ఒక్కొక్కరికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా చొప్పున విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. సామర్లకోట కుమ్మర్లవీధికి చెందిన గుబ్బల సుబ్రమణ్యం, పితాని భీమేశ్వరరావును 2019, నవంబరు 20న 60 లీటర్ల నాటుసారా, 100 లీటర్ల పులిసిన బెల్లపుఊటతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) అధికారులు పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు. అనంతరం జరిగిన వాదోపవాదనల్లో నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ సీహెచ్ జగదీష్ వ్యవహరించినట్టు సెబ్ నార్త్ సీఐ ఆర్‌బీ పెద్దిరాజు తెలిపారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర 2

దేవి మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర 2

తిరుమల	:	యాత్ర 2
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ 1	:	ఈగల్
సీ అండ్‌సీ 2	:	హనుమాన్
శ్రీప్రియ	:	గుంటూరుకారం
పద్మప్రియ	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
సత్యగౌరి	:	లాల్‌సలామ్
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	లాల్‌సలామ్

సామర్లకోటలో చోరీ

సామర్లకోట, ఫిబ్రవరి 13: పట్టణంలో ఉప్పు వారి వీధిలో మంగళవారం పట్టపగలే తాళాలు వేసిన ఇంటి తలుపులు తెరిచి బంగారపు ఆభరణాలు చోరీకి పాల్పడ్డారు. దూళ్ళ చంద్రమౌళికి చెందిన ఇంటి తులుపులకు తాళాలు వేసి బయటకు వెళ్లి వచ్చి చూసేసరికి తెరిచి ఉండడాన్ని గుర్తించి సామర్లకోట పోలీసులకు సమాచారం అందించారు. కాకినాడ నుంచి క్లూస్ టీం బృందాలు చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. బంగారపు ఆభరణాలు చోరీ అయ్యినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు.

సైకో జగన్ పాలనలో ప్రజలకు కష్టాలు

» మాజీ ఎమ్మెల్యే వర్మ

» తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు



పిఠాపురంలో టీడీపీలో చేరినవారితో వర్మ

పిఠాపురం, ఫిబ్రవరి 13: సైకో జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆదర్శ ఆటో యూనియన్ సభ్యులు, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో టీడీపీలో చేరారు. వారందరికి వర్మ తెలుగుదేశం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పిఠాపురం మండలం పి.రాయవరంలో పలువురు టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు పది రూపాయిలు ఇచ్చి చార్జీలు, పన్నుల వడ్డన, అధిక ధరల పేరుతో వంద రూపాయిలు లాక్కుంటున్నారని విమర్శించారు. వైసీపీ నేతల అరాచకాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. స్థానిక నాయకత్వంతోనే అభివృద్ధి జరుగుతుందని నమ్మి టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. వైసీపీ పాలనలో ఆటోడ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తాము అధికారంలోకి రాగానే వారిని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. ప్రజలు ఇబ్బందులు, కష్టాల్లో ఉన్నప్పుడు పట్టించుకోకుండా ఎన్నికల ముందు వచ్చే నేతలకు ఓటుతో తరిమికొట్టాలని వర్మ పిలుపునిచ్చారు. అనంతరం పి.రాయవరం గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుని రూరల్: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణుడు

ఎస్.అన్నవరంలో...

తుని రూరల్, ఫిబ్రవరి 13: ఎస్.అన్నవరంలో గ్రామంలో వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వారికి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీలోకి చేరినవారిలో ప్రగడ వీరబాబు, ప్రగడ శేషగిరి, బొడ్డ ప్రసాద్, బోనం నవీన్, జావదుల మణి, అక్కిరెడ్డి సాయి, యాడగుల సాయి, ఆకుల చందు, చోడిశెట్టి పండు ఉన్నారు. పోల్నాటి శేషగిరిరావు, అప్పన రమేష్, మోతుకూరి వెంకటేష్, వంగలపూడి శ్రీనివాస్, పోల్నాటి రామలింగేశ్వరరావు, కొచ్చేర్లపాటి అరవింద వర్మ పాల్గొన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి శూన్యం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్



తామరాడలో పర్యటిస్తున్న నవీన్‌కుమార్

కిర్లంపూడి, ఫిబ్రవరి 13: జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తమయ్యాయని గ్రామ పంచాయతీల అభివృద్ధి శూన్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని తామరాడ గ్రామంలో మంగళవారం మాజీ సర్పంచ్ అనుకుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నవీన్ నాయకులు, కార్యకర్తతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ముందు జగన్ హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోగా టీడీపీ ప్రవేశపెట్టిన పథకాల్లో కోతలు విధించి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి సీఎం నిధులు మంజూరు చేయకపోగా కేంద్రప్రభుత్వం విడుదల చేసిన నిధులు సైతం కైకర్యం చేస్తున్నారన్నారు. దీంతో విద్యుత్ బల్బులు, డ్రైనేజీల్లో పూడిక తీత తీయించడానికి ఇబ్బంది లేక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. నిత్యావసర సరుకులతో పాటు విద్యుత్, బస్ చార్జీలు పెంచి పేదవారి నడ్డి విరుస్తున్నారన్నారు. మరో 2 నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, సర్పంచ్ వీరం రెడ్డి కాశీబాబు, పట్టు చంటిబాబు, బొజ్జం శ్రీను, ఎంపీటీసీ గరగ గోవిందు, గొడే బాల, కుంచుమర్తి రాఘవ, నీలం శ్రీను, అల్లుమల్లు బాబి, బాబులు, కొత్త కొండబాబు, పాఠంశెట్టి మురళీకృష్ణ, పెనగంటి బాబ్జి, కుంచే తాతాజీ, జంపన రవివర్మ, టి.విశ్వనాధం, మూర్తిసత్తిబాబు, ఆళ్ళ శివ, కందా మణిదీప్, అప్పన్న రాజా, బొదిరెడ్ల సుబ్బారావు ఉన్నారు.

వైసీపీ అరాచక పాలన పోవాలి

ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ



సత్యప్రభకు హారతి ఇస్తున్న మహిళలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 13: వైసీపీ అరాచక పాలన పోవాలని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక వినాయకగుడి వీధిలో మంగళవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని.. టీడీపీ, జనసేన కూటమికి విజయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, ఉత్తరకంచి సర్పంచ్ మంతెన శ్రీను, వై.గోవిందనాయుడు, అం బటి రాంబాబు, పోలిశెట్టి శ్రీనివాస్, లొండా లోవరాజు పాల్గొన్నారు.

'ఇళ్ల స్థలాలను అప్పగించి రిజిస్ట్రేషన్ చేయాలి'

సామర్లకోట, ఫిబ్రవరి 13: మండలంలోని వెంకటకృష్ణ రాయపురం గ్రామానికి చెందిన పలువురు దళితులైన ప్రభుత్వ ఇళ్ల స్థలాల లబ్ధిదారులు సామర్లకోట-కాకినాడ రోడ్డుపై పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం తమకు మూడేళ్ల క్రితం ఇళ్ల పట్టాలు ఇచ్చినా స్థలాలు చూపలేదని వాపోయారు. ఈ విషయాన్ని రెండేళ్ల నుంచి చెప్తున్నా పట్టించుకోని అధికారులు 3 రోజులుగా రిజిస్ట్రేషన్ చేస్తామని హడావుడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తమకు స్థలాలను అప్పగించిన తర్వాతే ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించాలని కోరారు. నిరసనకు టీడీపీ నాయకులు కుర్రా నారాయణ స్వామి, గొల్లపల్లి సర్వేశ్వరరావు సంఘీభావం తెలి పారు. అనంతరం కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ వద్దకు వెళ్లిన దళితులు తమ సమస్యను వివరించారు. సామర్లకోట ఇన్‌చార్జి తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ సందర్శించి సమస్య పరిష్కరిస్తారని ఆర్డీవో స్పష్టం చేయడంతో రాస్తారోకో విరమించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

కరప, ఫిబ్రవరి 13: స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో మంగళవారం కరప మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యకలాపాలను సభ్యులకు వివరించారు. రోడ్లుభవనాలశాఖ ద్వారా జరిగిన ప్రగతిని ఆ శాఖ ఏఈ కె.సాయిబాబారెడ్డి సభ్యులకు వివరించారు. అయితే కరప-అరట్లకట్ట రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ కొరుపల్లి ఎంపీటీసీ దేవిశెట్టి సూర్యప్రకాశరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. పాతర్లగడ్డ రోడ్డుకు ఇరుపక్కలా జంగిల్ క్లియరెన్స్ చేయక తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయంటూ ఆ గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఏసుదాసు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలు రోడ్ల దుస్థితిపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యుల ప్రశ్నలకు ఏఈ నీళ్లు నమలడంతో జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచించడంతో సద్దుమణిగింది. మిగిలిన శాఖలకు సంబంధించిన ప్రగతిని అధికారులు వివరించగా వాటిపై ఎటువంటి చర్చ లేకపోవడంతో సభ సాదాసీదాగా ముగిసింది. కూరాడ సర్పంచ్ వాసంశెట్టి వెంకటరమణ మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, వైస్‌ఎంపీపీ బొమ్మిడి వీరరాఘవులు, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహశీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

'రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 13: కాకినాడలోని ఎన్ఎఫ్‌సీఎల్ కర్మాగారం ఆస్తుల బదలాయింపు రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు కోరారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు, జిల్లా కార్యదర్శి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మంగళవారం కాకినాడలో జిల్లా రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. కోసంస్థ గ్రీన్‌కో, సర్వశక్తి సంస్థ చలమలశెట్టి అనిల్‌ల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే ఈ ఒప్పందమన్నారు. ఈ వ్యవహారంపై ఈడీ ద్వారా విచారణ జరిపించాలని, అప్పటి వరకు భూముల బదలాయింపులు ఆపాలన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

గొర్రిపూడి (కరప), ఫిబ్రవరి 13: గొర్రిపూడిలో బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ ఘంటసాల గోవిందరాజు పార్టీ నేతలతో కలిసి బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వికసిత్ భారత్ పోస్టర్లు, క్యా లెండర్లను పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జి తుమ్మలపల్లి నారాయణరావు, జిల్లా పోరుబాట కో-కన్వీనర్ పుట్టా గాంధీ, జిల్లా కార్యదర్శులు కాళ్ల ధనరాజ్, పైడా రవీంద్ర, చోడిశెట్టి రమేష్‌బాబు, కర్రి సత్యనారాయణ, గంటసాల నాగరాజు, పద్మ, నాగశివ, దుర్గాప్రసాద్, ఏసుకుమార్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యతా లోపంపై ఆగ్రహం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 13: మధ్యాహ్న భోజనంలో నాణ్యతా లోపంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు మండలం కొడవలి మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పెట్టే భోజనం నాణ్యత సరిగా ఉండడం లేదని తల్లిదండ్రులు ఆరోపించారు. మంగళవారం భోజనంలో భాగంగా వడ్డించిన పులిహోర అధ్వానంగా ఉందని, పచ్చడి నీళ్లలా ఉందని పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. గొల్లప్రోలు ఎంఈవో నాయుడు వెంకటేశ్వరరావు పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతానన్నారు.

రక్తదాన శిబిరం

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 13: రోటరీక్లబ్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ప్రారంభించారు. కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోలకు చెందిన 110మంది రక్తదానం చేశారు.

9న జాతీయ లోక్ అదాలత్

ఏడవ అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

పెద్దాపురం, ఫిబ్రవరి 13: న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.చంద్రమౌళీశ్వరి పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మంగళవారం మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగ్గ కేసులను పరిష్కరించేందుకు న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. న్యాయవాదుల సీనియర్ సివిల్ జడ్జి దీపా దైవకృప, జూనియర్ సివిల్ జడ్జి హర్షవర్ధన్, బెంచ్ కోర్టు న్యాయమూర్తి శేషాచార్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు నేరం'



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

శంఖవరం, ఫిబ్రవరి 13: బాల్య వివాహాలు చట్టరీత్యానేరమని, అటువంటి వివాహాలను నిర్వహించిన వారికి రూ.లక్ష జరిమానా, రెండేళ్లు జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుందని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలన చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ,మండలస్థాయిలో అధికారులను నియమించామన్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునేవారు శిశుగృహ నందు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, అల్లూరి వెంకటరమణ, అరుణ తదితరులు ఉన్నారు.

కొండబాబును కలిసిన సుభాష్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 13: కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును మంగళవారం ఆయన నివాసంలో టీడీపీ అమలాపురం జిల్లా యూత్ కన్వీనర్, బీసీ నాయకుడు వాసంశెట్టి సుభాష్ మర్యాద పూర్వకంగా కలిశారు. కొండబాబు శాలువాతో సుభాష్‌ను సత్కరించారు. అనంతరం వారిద్దరూ పార్టీ కార్యక్రమాలపై చర్చించుకున్నారు.

పనసపాడులో అధికార పార్టీ ఒత్తిళ్లతో...

గోడ కూల్చివేతకు యత్నం

అడ్డుకున్న గ్రామస్తులు, పంతం నానాజీ, సానా సతీష్ వర్గీయులు




అధికారులతో మాట్లాడుతున్న పంతం నానాజీ

సామర్లకోట, ఫిబ్రవరి 13: సామర్లకోట మండలం పనసపాడు గ్రామ పరిధిలో హైవేకు దగ్గర్లో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అనుమతులు లేవన్న కారణంతో నిర్మాణంలో ఉన్న గోడ కూల్చివేతకు మంగళవారం అధికారులు యత్నించారు. జాతీయ రహదారిని ఆనుకుని టీడీపీ నేత గట్టి సత్యనారాయణ అనే వ్యక్తికి చెందిన ఖాళీస్థలం ఉంది. ఇక్కడ సానా సతీష్ అనే వ్యక్తి అతిథిగృహం నిర్మిస్తున్నారు. అతడు ఇటీవల జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిశారు. త్వరలో ఆయన జనసేనలో చేరే అవకాశం ఉంది. ఈ సమాచారంతోనే వైసీపీ నాయకులు అధికారులపై తీవ్ర వత్తిడి తెచ్చి ఆ నిర్మాణ పనుల గోడను కూల్చివేయాలని ఆదేశించినట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్డీవో ఆదేశాల మేరకు గోడను కూల్చేందుకు ఆ స్థలం వద్దకు ఎక్స్‌కవేటర్‌ను తీసుకువచ్చారు. దీంతో సతీష్‌కుమార్ వర్గీయులతో పాటు పలువురు గ్రామస్తులు దీన్ని అడుకున్నారు. జనసేన పీఏసీ సభ్యుడు పంతం నానాజీ తన అనుచరులతో పనసపాడు చేరుకుని అధికారులతో చర్చించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గోడను తొలగించేందుకు తాము వచ్చినట్టు ఆర్డీవో ఇట్ల కిషోర్, సామర్లకోట ఇన్‌చార్జి తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ స్పష్టం చేశారు. నోటీసులు ఇవ్వకుండా ఎలా గోడ కూలుస్తారని నానాజీ అధికారులను నిలదీశారు. సానా సతీష్ జనసేనలో చేరుతున్నారన్న అక్కసుతోనే వైసీపీ నేతలు అప్రజా స్వామికంగా అధికారులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీంతో అధికారులు వెనుతిరగడంతో వివాదం తాత్కాలికంగా సద్దు మణిగింది.

నేడు జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ

జగ్గంపేట, ఫిబ్రవరి 13: ఇర్రిపాకలో భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం వద్ద మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కుటుంబం ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఉదయం 10.58 గంటలకు జరుగుతుంది. శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి ఈ ప్రతిష్ఠ చేయబోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. జ్యోతుల మణి, లక్ష్మీదేవి, అనీష్, భాస్కరరావు, కొండబాబు, బాబ్జి, సురేంద్ర, రామచంద్రారెడ్డి ఉన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న నెహ్రూ కుటుంబం



పాదగయలో నీరు తొలగింపు

పిఠాపురం, ఫిబ్రవరి 13: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలోని పుష్కరిణిలో నీటిని మంగళవారం తొలగించారు. వచ్చే నెలలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పాదగయ పుష్కరిణిలో లక్షలాది మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ నేపథ్యంలో పుష్కరిణిలో ఉన్న నీటిని తొలగించారు. పుష్కరిణిని శుభ్రం చేసి మళ్లీ కొత్త నీరు పెట్టనున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీరు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్

పిఠాపురం, ఫిబ్రవరి 13: పిఠాపురంలో మంగళవారం ప్రారంభమైన లిటిల్‌చాంప్స్ ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్ ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. పిఠాపురం, తుని, జగ్గంపేట, ఏలేశ్వరం, సామర్లకోట ప్రాంతాలకు చెందిన 3,4,5వ తరగతుల విద్యార్థులు పాల్గొన్న ఈ స్పోర్ట్స్ మీట్‌ను పిఠాపురం మున్సిపల్ కమిషనరు కనకారావు ప్రారంభించారు. బాలబాలికలకు 45,55,65 మీటర్ల రిలే పరుగు పోటీలు, జిగ్‌జాగ్ రిలే, జంపింగ్ ఆన్ బోత్ పిట్, రోలింగ్ ద బాల్ తదితర పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. భాష్యం జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజులు, ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్‌ఎం అరుణ పాల్గొన్నారు.

సీనియర్ టీడీపీ నేత మృతి

కోటనందూరు, ఫిబ్రవరి 13: మండలంలో భీమవరపుకోట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, విశ్రాంతి ఉపాధ్యాయుడు అనిసింగరాజు జగన్నాధరావు (82) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ యనమల దివ్య, మాజీ జడ్పీటీసీ పెంటకోటభాస్కరసత్యనారాయణ, మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, అంకం రెడ్డి రమేష్, షేక్‌నవాబ్ జానీ, యర్ర చినసత్యనారాయణ, లెక్కల భాస్కర్ మేరపురెడ్డి జోగిబాబు, ఏ.నర్సింహమూర్తి సంతాపం తెలిపారు.

ఆసరా చెక్కు అందజేత

కిర్లంపూడి, ఫిబ్రవరి 13: ఆసరా పథక చెక్కును కిర్లంపూడి సత్యదేవ కల్యాణ మండపంలో మంగళవారం పంపిణీ చేశారు. జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జి తోట నరసింహం, తనయుడు రాంజీ హాజరై మండలంలో 1764డ్వాక్రా సంఘాలకు రూ.15.30లక్షల ఆసరా చెక్కును అందజేశారు. ఏపీఎం ఇనకోట శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, తోట వరహాలయ్య, ఎంపీటీసీ తోట వేణు, తోట నరేంద్ర, దాడి చినబుజ్జి, పాముల చంటి,పెనగంటి రాజేష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు గుడాల సంధ్యారాణి, సెక్రటరీ రాణి, ఆర్.లక్ష్మి ఉన్నారు.

'ఆదిత్య'లో వైద్య శిబిరం

గండేపల్లి, ఫిబ్రవరి 13: సూరంపాలెంలోని ఆదిత్య ఫార్మసీ కళాశాలలో మంగళవారం విద్యార్థులు, సిబ్బంది అపోలో షైన్ ఫౌండేషన్‌తో కలిసి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణులు, దంత వైద్యులు విద్యార్థులను సిబ్బందిని పరీక్షించి తగు సూచనలు సూచించారు. గుండె పరీక్ష, సాధరణ ఆరోగ్య పరీక్షల శిబిరం బుధవారం జరుగతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పరిణయశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడలో సురక్ష ఆరోగ్య శిబిరం

తొండంగి, ఫిబ్రవరి 13: కోదాడ గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, గాబురాజు తదితరులు శిబిరాన్ని సందర్శించారు. ఎంపీడీవో పసుపులేటి సతీష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సత్తెమ్మతల్లి పూలగరగల సంబరం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 13: ప్రత్తిపాడు గ్రామదేవత సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి పూలగరగల సంబరం వైభవంగా నిర్వహించారు. తీన్‌మార్ బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులు మధ్య అమ్మవారిని పూలగరగలపై ప్రతిష్ఠించి గ్రామంలో ఊరేగించారు. ఆలయం వద్ద మనోజ్ఞ, గ్రీష్మ, శరణ్య తదితర బాలికలు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది.

వైసీపీకి జిగిరెడ్డి శ్రీను రాజీనామా

రౌతులపూడి, ఫిబ్రవరి 13: వైసీపీకి ఆ పార్టీ మాజీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను రాజీనామా చేశారు. అయితే శ్రీను టీడీపీలో చేరుతున్నట్టు సన్నిహితులు తెలిపారు.